స్థానిక సంస్థల ఎన్నికలు ఉంటాయా ?

మేడ్చల్ నియోజకవర్గం పట్టణీకరణలో భాగంగా గ్రామాలు పట్టణాలుగా మారుతున్నాయి. కొన్ని జీహెచ్ఎంసీలో విలీనం కాగా.. కొన్ని పంచాయతీలుగానే ఉన్నాయి. మిగిలిన ప్రాంతాల్లో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణపై ప్రజలు, అధికారుల్లో అయోమయం నెలకొంది. మున్సిపాలిటీలు, కార్పొరేషన్లుగా ఏర్పడిన ప్రాంతాలతో పాటు మిగిలిన వాటిని కూడా విలీనం చేస్తారా.. లేక ఎన్నికలు నిర్వహిస్తారా.. అనే విషయంపై ఎలాంటి స్పష్టత లేకుండా పోయింది.

- ఎంపీటీసీ స్థానాలను ఖరారు చేసిన అధికారులు
- మేడ్చల్‌లో మిగిలింది 3 మండలాలే
- విలీనమా.. కొనసాగిస్తారా..
- ప్రజలు, నేతల్లో నెలకొన్న అయోమయం

మేడ్చల్ : పదేళ్ల క్రితం జిల్లాల పునర్విభజనకు ముందు మేడ్చల్ నియోజకవర్గం కేవలం కీసర, మేడ్చల్, శామీర్‌పేట్, ఘట్‌కేసర్ మండలాలతో ఉండేది. ఈ మండలాలతో పాటు మూడు చింతలపల్లి మండలం, మేడిపల్లి, కాప్రా రెవెన్యూ మండలాలు ఏర్పడ్డాయి.

◆ మేడ్చల్ మండలంలో కొన్ని గ్రామాలతో మేడ్చల్, గుండ్లపోచంపల్లి, మున్సిపాలిటీలు శామీర్‌పేట్ మండలంలో తూంకుంట, కీసర మండలంలో నాగారం, దమ్మాయిగూడ, ఘట్‌కేసర్ మండలంలో ఘట్‌కేసర్, పోచారం మున్సిపాలిటీలు మారగా, శామీర్‌పేట్ మండలంలోని జవహర్‌నగర్, ఘట్‌కేసర్ మండలంలోని పీర్జాదిగూడ, బోడుప్పల్‌లు కార్పొరేషన్లుగా మారాయి. దీంతో 7 మున్సిపాలిటీలు, 3 కార్పొరేషన్లు, 5 మండల పరిషత్‌లు, 5 జెడ్పీటీసీలతో మేడ్చల్ నియోజకవర్గం స్థానిక సంస్థల్లో అన్ని పాలనకు నెలవుగా మారింది.

ఐదేళ్లలో మారిన సీన్..

ఐదేళ్ల క్రితం వరకు అన్ని పాలనలకు నెలవుగా ఉన్న మేడ్చల్ సీన్ రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రాగానే పూర్తిగా మారిపోయింది. ప్రభుత్వం హైదరాబాద్ నగరాన్ని మహానగరంగా మారుస్తుండటంతో శివారు గ్రామాలు, మున్సిపాలిటీల్లో విలీనం చేయడంతో కీసర, ఘట్‌కేసర్ మండలాలు కనుమరుగయ్యాయి.

◆ మేడ్చల్ మండలంలో 12 గ్రామాలు, శామీర్‌పేట్ మండలంలో 8 గ్రామాలు, మూడు చింతలపల్లిలో 11 గ్రామాలు మాత్రమే మిగిలాయి. మేడ్చల్, శామీర్‌పేట్, మూడు చింతలపల్లి మండలాలు గ్రామాలతో పీఆర్ మండలాలుగా ఉన్నాయి. గతంలో 5 జెడ్పీటీసీలు ఉండగా.. ప్రస్తుతం సంఖ్య మూడుకు పడిపోయింది.

ఎన్నికలకు ఏర్పాట్లు చేస్తున్న అధికారులు..

రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికల హడావుడి నడుస్తుండటంతో అన్ని జిల్లాలతో పాటు మేడ్చల్ జిల్లా అధికారులు స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు ఏర్పాట్లు చేస్తున్నారు. మేడ్చల్ శామీర్‌పేట్, మూడు చింతలపల్లి మండలాలకు జెడ్పీటీసీలతో పాటు మేడ్చల్ మండలంలో 7 ఎంపీటీసీ స్థానాలు, శామీర్‌పేట్ మండలంలో 5 ఎంపీటీసీ స్థానాలు మూడు చింతలపల్లిలో 6 ఎంపీటీసీ స్థానాలు ఖరారు చేశారు.

సాధ్యమేనా...

మేడ్చల్ జిల్లాలో మూడు మాత్రమే జెడ్పీటీసీ స్థానాలు ఉన్నాయి. ముగ్గురు జెడ్పీటీసీలతో జెడ్పీ పాలకవర్గం ఏర్పాటు సాధ్యమేనా అనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. ముగ్గురిలో ఒకరు జెడ్పీ చైర్మన్, మరొకరు వైస్ చైర్మన్, ఇంకొకరు సభ్యుడు ఇలా జెడ్పీ కనిపిస్తుంది. ఇది సాధ్యమయ్యే అవకాశాలు లేవని అధికారులు చెబుతున్నారు.


మేడ్చల్ జిల్లా జెడ్పీ కార్యాలయం


మూడుచింతలపల్లి మండల పరిషత్ కార్యాలయం

◆ జెడ్పీలో ముగ్గురు ఎంపీపీలు సభ్యులుగా ఉన్నా.. వారికి ఓటుహక్కు లేకపోవడంతో వారి పాత్ర నామమాత్రమే. ముగ్గురు జెడ్పీటీసీలు, ముగ్గురు ఎంపీపీలు, 31 సర్పంచ్‌లతో జిల్లా పరిషత్, మండల పరిషత్‌లు కొనసాగడం కష్టమే. ఈ లెక్కలు ఉన్నతాధికారులు తేల్చాల్సిందే.

మున్సిపాలిటీలకు అవకాశాలు తక్కువ..

మేడ్చల్ నియోజకవర్గంలో నూతన మున్సిపాలిటీల ఏర్పాటుకు అవకాశాలు తక్కువ. ప్రభుత్వం రెండు నెలల క్రితం ప్రకటించిన మున్సిపాలిటీల్లో మేడ్చల్ జిల్లాలో ఒక్కటి కూడ లేదు. మున్సిపాలిటీలలో సమీప గ్రామాలను విలీనం చేశారు. దీంతో నూతన మున్సిపాలిటీల ఏర్పాటుకు అవకాశం లేకుండా పోయింది.

అంతా హైదరాబాద్..

నగరానికి 30 కిలోమీటర్ల దూరంలోనే ఉన్న మేడ్చల్ నియోజకవర్గంలోని మెజారిటీ ప్రాంతాలు హైదబాద్‌లో కలిసిపోయాయి. మున్సిపాలిటీలు, కార్పొరేషన్లుగా ఉన్నా.. అవి హైదరాబాద్‌లోనే అంతర్భాగంగా మారిపోయాయి. జవహర్‌నగర్, బోడుప్పల్, ఫీర్జాదిగూడ కార్పొరేషన్లు, గుండ్లపోచంపల్లి, తూంకుంట, పోచారం, నాగారం, దమ్మాయిగూడ మున్సిపాలిటీలు పట్టణ స్థాయిని మించి నగరానికి చేరువగా ఉన్నాయి. మేడ్చల్ నియోజకవర్గం మొత్తాన్ని నగరపాలక సంస్థలో విలీనం చేస్తున్నారే మాటలు ఎక్కువగా వినిపిస్తున్నాయి.

ఎన్నికల గురించి తేల్చలేకపోతున్న అధికారులు..

ఎన్నికలకు ఏర్పాట్లు చేస్తున్న అధికారులు ఎన్నికల నిర్వహణపై తేల్చలేకపోతున్నారు. ఎన్నికల నిర్వహణపై మండల స్థాయి నుంచి జిల్లాస్థాయి అధికారి వరకు ఎవరిని కదిలించినా.. అన్ని జిల్లాల్లో ఏర్పాట్లు చేస్తున్నారు. మేడ్చల్‌లో ఎన్నికలు ఉంటాయో.. లేదా అనే విషయంపై స్పష్టత ఇవ్వడం లేదు. తమకు ఎలాంటి సమాచారం తెలియదని చెబుతున్నారు.

నెలకొన్న సందిగ్దత..

నియోజకవర్గంలో పూర్తిగా సందిగ్ధత నెలకొనడంతో నాయకులు, ప్రజలు, ప్రజాప్రతినిధులు పదవులకు పోటీ చేద్దామనుకునే వారిలో అయోమయం కనిపిస్తోంది. నియోజకవర్గంలో రాష్ట్రస్థాయి రాజకీయాలను నడిపించే నాయకుడు లేకపోవడంతో అధికారపక్షం, ప్రతిపక్షంలో ఎలాంటి స్పష్టత కనిపించడం లేదు.

మహంకాళి ఆలయ కుంభాభిషేకానికి ఆహ్వానం


ఎమ్మెల్యే మల్లారెడ్డికి ఆహ్వానపత్రికను అందజేస్తున్న దృశ్యం

కీసర: రాంపల్లిలోని మహంకాళి దేవాలయ కుంభాభిషేక మహోత్సవానికి బుధవారం రాంపల్లి మహంకాళి దేవస్థానం చైర్మన్ భూమయ్య ఎమ్మెల్యే మల్లారెడ్డిని కలిసి ఆహ్వానం అందజేశారు. ఈనెల 7,8,9వ తేదీల్లో కుంభాభిషేకం ప్రత్యేక పూజలను కనుల పండువగా నిర్వహించనున్నట్లు తెలిపారు. అనంతరం నాగారం మున్సిపల్ కమిషనర్ భాస్కర్‌రెడ్డి, మేనేజర్ చంద్రశేఖర్‌లకు కుడా ఆహ్వాన పత్రికలను అందజేశారు. గండి అంజయ్యగౌడ్, వరకాల పెంటయ్య, నర్సింహ్మారెడ్డి, రాంరెడ్డి, లక్ష్మారెడ్డి, అశోక్‌గౌడ్, రామకృష్ణారెడ్డి, మచ్చ శ్రీనివాస్, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికుల వేతనాలు పెంచాలి



మేడ్చల్‌రూరల్ : మున్సిపల్ కార్మికుల కనీస వేతనం రూ.26 వేలకు పెంచాలని ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఏసురత్నం అన్నారు. బుధవారం గుండ్లపోచంపల్లి మున్సిపల్ కార్మికులతో కలిసి ఆందోళన చేపట్టారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ స్వామిని కలిసి వేతనాలు పెంచాలని, కార్మికుల సమస్యలను తొలగించాలని వినతిపత్రం అందజేశారు. కిరణ్, ప్రభాకర్, సాయిలు, బాలేష్, యాదగిరి, మంగమ్మ, సావిత్రి, పెంటమ్మ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ మేడ్చల్ రూరల్ అధ్యక్షుడికి సత్కారం


సత్కరిస్తున్న కౌకుట్ల చంద్రారెడ్డి తదితరులు

కీసర: బీజేపీ మేడ్చల్ జిల్లా రూరల్ నూతన అధ్యక్షుడిగా ఎన్నికైనా బుద్ధి శ్రీనివాస్‌ను బుధవారం నాగారం మున్సిపల్ మాజీ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి మర్యాద పూర్వకంగా కలిసి శాలువతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా బుద్ధి శ్రీనివాస్ మాట్లాడుతూ.. ప్రధాని నరేంద్రమోదీ నాయకత్వంలో జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను పెద్దఎత్తున ప్రజల్లోకి తీసుకెళ్లి బీజేపీ బలోపేతానికి చర్యలు చేపట్టాలని సూచించారు. మేడ్చల్ జిల్లా రూరల్ అధ్యక్షుడు పటోళ్ల విక్రంరెడ్డి, నాగారం మున్సిపల్ మాజీ కౌన్సిలర్ బిజ్జ శ్రీనివాస్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

తిమ్మాయిపల్లి పాఠశాలలో డీఈఓ ఆకస్మిక తనిఖీ


విద్యార్థులతో జిల్లా విద్యాధికారి విజయకుమారి

కీసర: తిమ్మాయిపల్లి ప్రాథమిక పాఠశాలను (ఎంపీపీఎస్) బుధవారం జిల్లా విద్యాశాఖ అధికారి విజయకుమారి సందర్శించారు. పాఠశాలలో చదువుతున్న విద్యార్థుల ఎఫ్ఎల్ఎన్ ప్రగతి, పఠనా సామర్థ్యాలను పరిశీలించారు. ఉపాధ్యాయుల తరగతి బోధనను పరిశీలించి మెరుగైన సామర్థ్యాలతో బోధించి ఎఫ్ఎల్ఎన్, ఓఆర్ఎఫ్‌లో మరిన్ని ఫలితాలను సాధించాలని ఆకాంక్షించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు జగన్‌మోహన్, ఉపాధ్యాయులు శ్రీనివాస్, అవినాష్, నాగజ్యోతి పాల్గొన్నారు.

పార్కు స్థలంలో బోర్డు ఏర్పాటు



పోచారం: మున్సిపాలిటీ పరిధిలోని ఉన్న 1542 చదరపు గజాల పార్కు స్థలాన్ని హైడ్రా అధికారులు పరిరక్షించారు. కొర్రెముల్‌లోని సర్వేనంబరు 747, 750లో ఉన్న ఈ పార్కు స్థలంలో హైడ్రా అధికారులు బుధవారం బోర్డును ఏర్పాటు చేశారు. కబ్జా చేస్తే జీఓ నంబరు 99/2024 ప్రకారం కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

ఘట్‌కేసర్: విద్యుత్ మరమ్మతుల కారణంగా కొండాపూర్ సబ్‌స్టేషన్ సింగరేణి ఫీడర్, ఘట్‌కేసర్ సబ్‌స్టేషన్ హెచ్‌పీసీఎల్ ఫీడర్ పరిధిలో గురువారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఏఈ యశ్వంత్‌కుమార్‌రెడ్డి తెలిపారు. సింగరేణికాలనీ, పటేల్‌నగర్, హెచ్‌పీసీఎల్ పరిధిలోని ప్రాంతాల్లో ఉదయం 10.30 గంటల నుంచి ఉదయం 11 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

గురుకుల దరఖాస్తులకు నేడే ఆఖరి రోజు

ఘట్‌కేసర్: ఎదులాబాద్‌లోని తెలంగాణ సాంఘీక సంక్షేమ గురుకుల ఫైన్ ఆర్ట్స్ స్కూల్ (ఎఫ్ఏఎస్)లో ఆరో తరగతిలో ప్రవేశ దరఖాస్తుల స్వీకరణ గురువారంతో ముగుస్తుందని ఆ స్కూల్ ప్రిన్సిపాల్ రాము, వైస్ ప్రిన్సిపాల్ రాములు తెలిపారు. ప్రస్తుతం ఐదోతరగతి చదువుతున్న బాల, బాలికలు ఫైన్ ఆర్ట్స్ స్కూల్‌లో ఆరోతరగతిలో చేరడానికి గురువారం దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

జూదరుల అరెస్ట్

ఘట్‌కేసర్: పేకాడుతున్న వ్యక్తులను ఘట్‌కేసర్ పోలీసులు బుధవారం అర్ధరాత్రి అదుపులోకి తీసుకున్నారు. అడ్మిన్ ఎస్సై ప్రభాకర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. ఈడబ్ల్యూఎస్ కాలనీలోని ఓ ఇంట్లో పేకాడుతున్నట్లు సమాచారంతో దాడులు నిర్వహించామన్నారు. రాజు, రాంబాబు, సుధాకర్, బాబు, యశ్వంత్, ఆదినారాయణ, మోహన్ అనే వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ.1.69 లక్షలను స్వాధీనం చేసుకున్నామని, మొబైల్ ఫోన్లను సీజ్ చేశామన్నారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

దివ్యాంగుల చలో ఢిల్లీని విజయవంతం చేయాలి

ఘట్‌కేసర్: దివ్యాంగుల హక్కుల సాధన కోసం దివ్యాంగులు చేపట్టిన చలో ఢిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని దివ్యాంగుల హక్కుల జాతీయ వేదిక జిల్లా అధ్యక్షుడు చంద్రమోహన్ అన్నారు. ఫిబ్రవరి 10న నిర్వహించ తలపెట్టిన ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఘట్‌కేసర్‌లో వాల్‌పోస్టర్‌ను బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దివ్యాంగులకు కనీస పెన్షన్‌ను రూ.5 వేలకు పెంచాలన్నారు. ప్రతి దివ్యాంగుడికి అంత్యోదయ రేషన్‌కార్డు అందజేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర కమిటీ పిలుపు మేరకు జిల్లా నుంచి పెద్దఎత్తున దివ్యాంగులు హాజరు కావాలని పిలుపునిచ్చారు. దివ్యాంగుల హక్కుల జాతీయ వేదిక మండల అధ్యక్షురాలు నీరజారెడ్డి, రఘు, మణికుమార్ పాల్గొన్నారు.


వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న చంద్రమోహన్ తదితరులు

మెగా జాబ్‌మేళాకు విశేష స్పందన

జవహర్‌నగర్: జవహర్‌నగర్ కార్పొరేషన్ పరిధిలోని నాచారం ఫైర్ విక్టమ్ కాలనీలో బుధవారం ఆదిత్య ఎంటర్‌ప్రైజెస్ ఆధ్వర్యంలో మెగా జాబ్ మేళా నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్ఎస్ రాష్ట్ర అధ్యక్షుడు ఎర్రగుడ్ల వెంకటేష్ మాట్లాడుతూ... నేటి యువత ఉపాధి అవకాశాలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆదిత్య ఎంటర్‌ప్రైజెస్ హెచ్ఆర్ మేనేజర్ షేక్ మిరాబి, కో-ఆర్డినేటర్ సీహెచ్. సౌమ్య, కాలనీ అధ్యక్షుడు నగేష్, దశరథగౌడ్, పరమేష్, అవినాష్ రాథోడ్, శ్రీనివాస్, యాదలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



ఫుట్‌పాత్ ఆక్రమణలపై ప్రత్యేక డ్రైవ్

సమీక్ష నిర్వహించిన అధికారులు

ఉప్పల్: ఉప్పల్ సర్కిల్ పరిధి ఫుట్‌పాత్ ఆక్రమణపై ప్రత్యేక డ్రైవ్ చేపడుతున్నట్లు ఉప్పల్ డిప్యూటీ కమిషనర్ ఆంజనేయులు తెలిపారు. ఫుట్‌పాత్‌లు ఆక్రమించి వ్యాపారాలు చేసుకునే వారు వెంటనే స్వచ్ఛందంగా ఆక్రమణలు ఎవ్వరికి వారు తొలగించుకోవాలని, లేదంటే తొలగిస్తామని హెచ్చరించారు. గ్రేటర్ కమిషనర్ ఆదేశాలను మేరకు త్వరలోనే ప్రత్యేక డ్రైవ్ చేపడుతున్న సందర్భంగా ఎలాంటి సమస్యలు ఉత్పన్నం కాకుండా ఉండేలా ముందస్తుగా వివిధ విభాగాల అధికారులు ఉప్పల్ ఇన్‌స్పెక్టర్ ఎలక్షన్‌రెడ్డి, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ నాగరాజు, టౌన్ ప్లానింగ్ ఏసీపీ, సూపర్‌వైజర్లతో కలిసి బుధవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ట్రాఫిక్ ఫ్రీగా వెళ్లేలా అన్ని రహదారుల్లో ఫుట్‌పాత్‌ల ఆక్రమణను తొలగించనున్నట్లు తెలిపారు.

కుషాయిగూడలో పోలీసుల స్పెషల్ డ్రైవ్..

కుషాయిగూడ: కుషాయిగూడ పోలీసులు స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. బుధవారం ఈసీఐఎల్ చౌరస్తా నుంచి చక్రీపురం చౌరస్తా వరకు డ్రైవ్ చేపట్టి ఫుట్‌పాత్‌లపై వ్యాపారాలు చేసుకుంటున్న చిరు వ్యాపారులకు అవగాహన కల్పించారు. రోడ్లకు ఇరువైపులా వ్యాపారాలు చేయడం వల్ల పాదచారులు, వాహనదారులు ఎదుర్కొంటున్న సమస్యలపై వారికి అవగాహన కల్పించారు. ఇబ్బందులు లేకుండా వ్యాపారాలు చేసుకోవాలని సూచించారు.


సమావేశంలో డీసీ ఆంజనేయులు, ఇన్‌స్పెక్టర్ ఎలక్షన్‌రెడ్డి, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ నాగరాజు

చర్లపల్లి అగ్ని ప్రమాదంపై ప్రజాప్రతినిధుల సమీక్ష

- ప్రమాదంలో రూ.25 కోట్ల ఆస్తినష్టం

కుషాయిగూడ: చర్లపల్లి పారిశ్రామికవాడలో జరిగిన అగ్ని ప్రమాదం ప్రమాదవశాత్తే జరిగినట్లు తేలింది. ఇందుకు సంబంధించి ఓ సీసీ కెమెరాలో లభించిన ఆధారాలతో వాస్తవం వెలుగులోకి వచ్చినట్లు సమాచారం. ఈ ఘటనపై సర్వోదయ కంపెనీ యజమాని బాల్‌రెడ్డి బుధవారం చర్లపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. సర్వోదయ, ఫ్లోరోషెల్, డీవీపీఎస్ మూడు కంపెనీల్లో సుమారు రూ.25 కోట్ల వరకు ఆస్తి నష్టం జరిగిందని ఫిర్యాదులో పేర్కొన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ రవీందర్ తెలిపారు. కంపెనీలోకి ప్రవేశించిన బొలేరో వాహన వివరాలు ఇంకా లభ్యం కాలేదని, వాహన వివరాలు తెలిస్తే మరిన్ని వాస్తవాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉందన్నారు.

ఘటనా స్థలాన్ని సందర్శించిన కార్పొరేటర్..

చర్లపల్లిలో అగ్ని ప్రమాద ఘటనా స్థలాన్ని బుధవారం స్థానిక కార్పొరేటర్ బొంతు శ్రీదేవి సందర్శించారు. ఐలా చైర్మన్ రోషిరెడ్డితో మాట్లాడి ప్రమాదానికి గల కారణాలు తెలుసుకున్నారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు చోటు చేసుకోకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

ప్రమాణాలు పాటించని పరిశ్రమలను మూసివేయాలి..

కనీస ప్రమాణాలు పాటించకుండా నిర్వహిస్తున్న పరిశ్రమలను మూసి వేయాలని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి దమోదర్‌రెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం ఘటనా స్థలాన్ని సందర్శించి మాట్లాడారు. కెమికల్ కంపెనీ నిర్వాహకుల నిర్లక్ష్యం వల్లే ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయన్నారు. కెమికల్ కంపెనీల నిర్వహణపై దృష్టి సారించడంతో పాటు కార్మికులకు భద్రత కల్పించాలన్నారు. శంకర్‌రావు, నారా నర్సింహ్మ, నర్సింగ్‌రావు, స్వామి దాస్, శ్రీనివాస్ ఉన్నారు.


ఘటనా స్థలం వద్ద కార్పొరేటర్ బొంతు శ్రీదేవి

నల్సార్ క్యాంటీన్‌లో తనిఖీలు


క్యాంటీన్‌లో బొద్దింకలు

శామీర్‌పేట్: హైదరాబాద్, శామీర్‌పేటలోని నల్సార్ లా యూనివర్సిటీ (హైదరాబాద్) క్యాంపస్‌లో మంగళవారం సాయంత్రం ఫుడ్ సేఫ్టీ, టాస్క్‌ఫోర్స్ అధికారుల బృందాలు తనిఖీ చేశాయి. యూనివర్సిటీలో క్యాంటీన్ నిర్వహిస్తున్న శ్రీ గణేష్ క్యాటరర్స్‌పై ఫుడ్ సేఫ్టీ, టాస్క్‌ఫోర్స్ బృందాలు తనిఖీ చేసి, స్టోర్‌రూమ్‌లో నిల్వ ఉంచిన బియ్యం, కూరగాయల వద్ద సరైన జాగ్రత్తలు పాటించకపోవడంతో నిర్వాహకులపై అసహనం వ్యక్తం చేశారు. ఆహారం తయారీ ప్రాంగణానికి రిజిస్టర్డ్ చిరునామాతో ఎఫ్ఎస్ఎస్ఏఐ లైసెన్స్ పొందారని, ఫ్రోస్టాక్ సూపర్‌వైజర్లకు శిక్షణ ఇవ్వలేదని అధికారులు తెలిపారు. స్టోర్ రూంలో ఎలుకలు, బొద్దింకలు సంచరిస్తున్నట్లు గుర్తించారు. ఎలాంటి ప్యాకింగ్ లేకుండా ఆహార ముడిపదార్థాలను నేలపై పడేశారని, తయారీ తేదీ, గడువు ముగింపు తేదీ లేని 30 కిలోల పెసర్లను సీజ్ చేసి, నిర్వాహకులపై కేసు నమోదు చేశారు.

గంజాయి విక్రయిస్తున్న ఇద్దరి రిమాండ్

అల్వాల్: గంజాయి విక్రయిస్తున్న ఇద్దరు యువకులను పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. వివరాల ప్రకారం.. గుంటూరుకు చెందిన మురళీకార్తీక్ (19), నరేందర్ (21) శివారులోని ఓ విద్యాలయంలో డిప్లొమా చదువుతున్నారు. వీరు అల్వాల్‌లోని ఒక ప్రముఖ కళాశాలలో చదువుతున్నప్పుడు గంజాయిని అలవాటు చేసుకున్నారు. అది కాస్తా ఉపాధిగా మార్చుకున్నారు. ఖమ్మం నుంచి రమేష్ అనే వ్యక్తి నుంచి గంజాయిని తీసుకొచ్చి అల్వాల్ ఫాదర్ బాలయ్యనగర్‌లో నివాసం ఉండే హాస్టల్ వద్ద ఉంచి పలువురికి 10 గ్రాములు రూ.300లకు విక్రయిస్తున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు మంగళవారం నిందితులను అదుపులోకి తీసుకుని 600 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. వారిని రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు పేర్కొన్నారు.

తీన్మార్ మల్లన్నపై ఫిర్యాదు

కుషాయిగూడ: రెడ్డిలపై ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న చేసిన అనుచిత వ్యాఖ్యలను నిరసిస్తూ.. బుధవారం కుషాయిగూడ రెడ్డి సంఘం ప్రతినిధులు తగిన చర్యలు తీసుకోవాలని, కుషాయిగూడ పోలీసులకు ఫిర్యాదు చేశారు. తీన్మార్ మల్లన్నకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. మల్లన్నను వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. రెడ్డి సంఘం ప్రతినిధులు పైళ్ల హరినాథ్‌రెడ్డి, బొజ్జ రాఘవరెడ్డి, కాసం మహిపాల్‌రెడ్డి, మహేందర్‌రెడ్డి, మొగిలి రాఘవరెడ్డి, పద్మారెడ్డి, నరసింహరెడ్డి, సామ వెంకట్‌రెడ్డి, సురేష్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, హనుమంతరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



'లక్షల డప్పులు, వేల గొంతులు' కళాకారుల ప్రదర్శన


జవహర్‌నగర్‌లో డప్పు కొడుతూ ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

జవహర్‌నగర్: 'లక్షల డప్పులు, వేల గొంతులు' కార్యక్రమాన్ని పురస్కరించుకుని ఎమ్మార్పీఎస్ మేడ్చల్, మల్కాజిగిరి జిల్లా ప్రధాన కార్యదర్శి వడ్డెపల్లి శివకుమార్ ఆధ్వర్యంలో జవహర్‌నగర్ కార్పొరేషన్ ఫైరింగ్ రేంజ్ నుంచి బాలాజీనగర్ ప్రధాన చౌరస్తా వరకు బుధవారం డప్పులతో కళాకారులు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మాజీ మేయర్ కావ్య, మాజీ సర్పంచ్ శంకర్‌గౌడ్ శ్రీనివాస్, శ్రీకాంత్‌యాదవ్‌లు హాజరయ్యారు. వారు మాట్లాడుతూ.. మాదిగల ఆకాంక్షను చాటేందుకే ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నామని వివరించారు. సుప్రీంకోర్టు తీర్పు ఆధారంగా రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే ఎస్సీ వర్గీకరణకు ఆమోదం తెలపాలని డిమాండ్ చేశారు. మాజీ కార్పొరేటర్లు జిట్టా శ్రీవాణి శ్రీనివాస్‌రెడ్డి, పానుగంటి బాబు, నాయకులు సదానంద్, వినయ్‌కుమార్, శ్రీనివాస్, వెంకటేష్, శ్రీనివాస్, ఎల్లస్వామి, పరుశురామ్, కుమార్, యాదగిరి, ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

సమరశీల పోరాటాలకు సిద్ధంగా ఉండాలి

ఘట్‌కేసర్: ఏఐటీయూసీ ఆధ్వర్యంలో సమరశీల పోరాటాలు చేపట్టేందుకు సిద్ధంగా ఉండాలని ఏఐటీయూసీ రాష్ట్ర నాయకుడు జయచంద్ర అన్నారు. బుధవారం ఘట్‌కేసర్ మండల సమితి ఆధ్వర్యంలో మున్సిపల్ సెక్యూరిటీ, ఆటో, సీహెచ్‌సీ కార్మికులు పట్టణంలో నిరసన చేపట్టారు. ఆయన మాట్లాడుతూ..రైతులు పండించిన పంటకు గిట్టుబాటు ధరల కోసం ఆందోళన చేపడితే, రైతులపై కేంద్రం ఉక్కుపాదం మోపుతోందని ఆరోపించారు. భవిష్యత్తులో కార్మికులు, రైతులు ప్రత్యక్ష పోరాటాలకు సిద్ధం అవుతున్నారన్నారు. ఏఐటీయూసీ జిల్లా నాయకుడు శ్రీనివాస్, రాంచందర్, మురళి, సువర్ణ, అండాలు, అరుణ, జంగమ్మ, సుజాత, రాంకుమార్, కష్ణ, ధర్మేంద్ర, బాలకష్ణ, శ్రీనివాస్ పాల్గొన్నారు.



ఘట్‌కేసర్‌లో ఏఐటీయూసీ ఆధ్వర్యంలో కార్మికుల నిరసన

చర్లపల్లి కబ్జాలపై మంత్రి సీతక్కకు వినతి


మంత్రి సీతక్కతో మాట్లాడుతున్న కాంగ్రెస్ నేతలు

కలెక్టర్, హైడ్రా కమిషనర్‌కు సిఫారసు చేసిన మంత్రి

కుషాయిగూడ: చర్లపల్లి ప్రభుత్వ భూమిలో కబ్జాల వ్యవహారం మంత్రి సీతక్క వరకు వెళ్లింది. బుధవారం గాంధీభవన్‌లో నిర్వహించిన ప్రజాదర్బార్‌లో స్థానిక కాంగ్రెస్‌పార్టీ యువ నాయకుడు బూడిద ప్రేమ్‌కుమార్ చర్లపల్లి కబ్జాలపై మంత్రికి ఫిర్యాదు చేశారు. సర్వే నెంబరు 30లో రాత్రికిరాత్రే వెలుస్తున్న అక్రమ నిర్మాణాలను మంత్రికి వివరించారు. సాక్షిలో చర్లపల్లిలో ఆగని కబ్జాలు శీర్షికన ప్రచురించిన కథనాన్ని మంత్రికి చూపారు. ఇక్కడ విధులు నిర్వహిస్తున్న రెవెన్యూ, ఇరిగేషన్, టౌన్‌ప్లానింగ్ అధికారులు చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. దీనిపై స్పందించిన మంత్రి మేడ్చల్ జిల్లా కలెక్టర్, హైడ్రా కమిషనర్ రంగనాథ్‌లకు సిఫారస్సు చేశారు.

అభివృద్ధి పనుల జాప్యంపై కార్పొరేటర్ ఆగ్రహం

మల్కాజిగిరి: మల్కాజిగిరి జీహెచ్ఎంసీ సర్కిల్ అధికారుల పనితీరుపై మల్కాజిగిరి డివిజన్ కార్పొరేటర్ శ్రవణ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. సఫిల్‌గూడ లేక్‌పార్క్ వద్ద జరుగుతున్న నూతన గేట్ ఏర్పాటు, ఫెన్సింగ్ పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. ఇంజినీరింగ్ విభాగం అధికారులు బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తున్నారని, పనుల్లో తీవ్ర జాప్యం జరుగుతోందన్నారు. పార్కు వద్ద ఉన్న టాయిలెట్స్ అధ్వానంగా ఉన్నాయని, గుర్రపు డెక్క కూడా తొలగించలేని పరిస్థితుల్లో ఉన్నాయన్నారు. ఒకే విభాగంలోని శానిటేషన్, ఇంజినీరింగ్, ఎంటమాలజీ అధికారుల మధ్య సమన్వయలోపం ప్రజలకు ఇబ్బందిగా మారిందన్నారు. పార్కుపైన వ్యర్థాలు పేరుకుపోయి దోమల బెడద అధికంగా ఉన్నా.. పట్టించుకునేవారే లేకుండా పోయారన్నారు. తగిన చర్యలు చేపట్టాలని, లేదంటే జీహెచ్ఎంసీ సర్కిల్ కార్యాలయం వద్ద ఆందోళన చేపడతామని ఆయన హెచ్చరించారు.


లేక్‌పార్కు వద్ద గేట్ ఏర్పాటును పరిశీలించిన కార్పొరేటర్ శ్రవణ్